క్లుప్తంగా

ధాన్యం రైతులు నగదు జమ చేయాలి

మండల వైఎస్సార్ సీపీ కన్వీనర్ బోడెపూడి కొండలు

శావల్యాపురం: రబీలో వరి పంట సాగు చేసిన రైతులు ప్రభుత్వ పరంగా రైతుసేవా కేంద్రాల ద్వారా ధాన్యం అమ్మిన రైతులకు ప్రభుత్వం నగదు జమ చేయకపోవటం శోచనీయమని మండల వైఎస్సార్ సీపీ కన్వీనర్ బోడెపూడి కొండలు సోమవారం కూటమి ప్రభుత్వ తీరును విమర్శించారు. ఈ సందర్భంగా మండల కన్వీనర్ బోడెపూడి కొండలు మాట్లాడుతూ మండలంలోని 11 రైతుసేవా కేంద్రాల నుంచి 268 మెట్రిక్ టన్నుల ధాన్యం 48 మంది రైతుల నుంచి కొనుగోలు చేసి నెల రోజుల గడుస్తున్నా నేటి వరకు రైతుల బ్యాంకు ఖాతాలో నగదు జమ చేయకపోవటం ప్రభుత్వ తీరుకు నిదర్శమన్నారు. ఖరీఫ్ సీజను ప్రారంభమవుతుందని తక్షణమే ప్రభుత్వం స్పందించి ధాన్యం అమ్మిన రైతుల నగదు జమ చేయాలన్నారు. మండలంలోని పోట్లూరు గ్రామానికి చెందిన రైతులకు అధిక మొత్తంలో నగదు జమ కావాల్సి ఉందని తెలిపారు.

బ్యాంకు మేనేజర్ల బదిలీ

నాదెండ్ల: గణపవరం స్టేట్‌బ్యాంక్ ఆఫ్ ఇండియా బ్రాంచి మేనేజర్ కట్టా సునీత బదిలీ అయ్యారు. ఈ మేరకు ఆమె సోమవారం అద్దంకి బ్రాంచి మేనేజర్‌గా బదిలీపై వెళ్ళారు. చిలకలూరిపేట ఎస్‌బీఐ మేనేజర్‌గా పనిచేస్తున్న మేక లక్ష్మీ బదిలీపై ఇక్కడకు వచ్చారు. గణపవరం బరోడా బ్యాంక్ మేనేజర్ జయకర్ గుంటూరుకు బదిలీ అయ్యారు. ముంబైలో పనిచేస్తున్న నారాయణ బదిలీపై ఇక్కడకు వచ్చారు.

2047 నాటికి భారతదేశం అన్ని రంగాల్లో అగ్రస్థానం

శావల్యాపురం: 2047 నాటికి భారతదేశం అన్ని రంగాల్లో అగ్రస్థానంలో ఉంటుందని మండల బీజేపీ అధ్యక్షులు గట్టుపల్లి శ్రీనివాసరావు అన్నారు. వికసిత భారత సంకల్ప సభ కార్యక్రమంలో భాగంగా మండలంలోని కారుమంచి, మతుకుమల్లి, బొందిలిపాలెం తదితర గ్రామాల్లో పర్యటించి 11 సంవత్సరాల అమృతకాలాన్ని పురస్కరించుకుని ప్రజలతో అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రధానమంత్రి నరేంద్రమోదీ సారథ్యంలోని ప్రభుత్వం పేద బడుగు బలహీన వర్గాల అభ్యున్నతి కోసం సంక్షేమ పథకాలు అమలు చేసిందన్నారు. కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాల పురోగతి గురించి ప్రజలను అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో గ్రామపెద్దలు యరమాసు కోటేశ్వరరావు, గోపాలం శివప్రసాదు, కోట హరిబాబు, అన్నవరపు శ్రీనివాసరావు పాల్గొన్నారు.

నేడు పలు గ్రామాల్లో విద్యుత్ సరఫరా బంద్

యడ్లపాడు: విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్లు, లైన్ల మరమ్మతుల కారణంగా మంగళవారం యడ్లపాడు మండలంలోని పలు గ్రామాలకు విద్యుత్ సరఫరాను నిలుపుదల చేస్తున్నట్లు ఆశాఖడీఈఈ ఆర్ అశోక్ కుమార్ తెలిపారు. మండలంలోని కొత్తపాలెం(పుట్టకోట), కొండవీడు, కోట, సొలస, చెంఘీజ్‌ఖాన్‌పేట, లింగారావుపాలెం గ్రామాలలో ఉదయం 9 నుండి మధ్యాహ్నం ఒంటి గంట వరకు విద్యుత్ సరఫరా ఉండదన్నారు. ఈ అంతరాయాన్ని గమనించి విద్యుత్ వినియోగదారులు సహకరించాలని కోరారు.

టాపర్లకు నగదు పారితోషికం అందజేత

నరేంద్ర సువర్ణకుమారి ఫౌండేషన్ అభినందన కార్యక్రమం



నగదు పురస్కారం అందుకున్న విద్యార్థులతో నరేంద్ర సువర్ణకుమారి

యడ్లపాడు: విద్యకు సేవారూపంగా నిలుస్తూ ప్రతిభావంతుల అభినందనలో ముందుంటున్న నరేంద్ర సువర్ణ కుమారి ఫౌండేషన్, 2024–25 విద్యా సంవత్సరానికి గాను పదవ తరగతి పరీక్షల్లో మండలంలోని వివిధ పాఠశాలల స్థాయిలో ఫస్ట్ ర్యాంక్ సాధించిన 11 మంది విద్యార్థిని విద్యార్థులకు అభినందనతో పాటు రూ.వెయ్యి చొప్పున నగదు పారితోషికాలు అందజేసింది. యడ్లపాడు జెడ్పీ ఉన్నత పాఠశాల ప్రిన్సిపాల్ జి.విజయభారతి అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమాన్ని స్థానిక జెడ్పీహైస్కూల్ ఆ పాఠశాల ప్రాంగణంలో నిర్వహించారు. ఫౌండేషన్ సువర్ణ నరేంద్రకుమారి మాట్లాడుతూ విద్యకు మించిన ఆస్తి విద్యార్థులకు మరేది లేదన్నది గ్రహించాలని, ఆ విజ్ఞాన సముపార్జనలోనే ఉన్నత శిఖరాలను చేరుకోవాలన్నారు. ఎంఈవో ఎం అరుణ కుమారి హాజరై అత్యధిక మార్కులు సాధించిన విద్యార్థులకు నగదు అందజేశారు. నగదు అందుకున్న వారిలో ఖరీదు జయలక్ష్మీ (ఉన్నవ), నక్క మేఘనాశ్రీ (లింగారావుపాలెం), టి.నాగవెంకట జ్యోతిక(జగ్గాపురం), అల్లూరి గీతాశ్రీలక్ష్మి (సొలస), పఠాన్ సమీరా (యడ్లపాడు), జంపాని సాగర్ (వంకాయలపాడు), వల్లూరు తేజస్విని (సందెపూడి), కత్తి రాహుల్ (తిమ్మాపురం), కె.గాబ్రియేలు (యడ్లపాడు లూథరన్), మొగిలి శివపార్వతి(యడ్లపాడు జెడ్పీ) ఉన్నారు. కార్యక్రమంలో ఫౌండేషన్ ఉపాధ్యక్షుడు వై ప్రసాదరావు, హెచ్‌ఎం రామిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.



ఆర్‌యూబీకి శ్రీకారం

శావల్యాపురంలోని రైల్వే గేటు (268) వద్ద నూతనంగా ఆర్‌యూబీ నిర్మాణ పనులకు సోమవారం భూమి పూజా కార్యక్రమం రైల్వే అధికారులు కాంట్రాక్టరు, గ్రామస్తులు నిర్వహించారు. ఆర్‌యూబీ నిర్మాణ పనులకు రూ.5 కోట్లు నిధులు మంజూరు కాగా రైల్వే ఉన్నతాధికారుల పర్యవేక్షణలో 8 నెలల వ్యవధిలో పనులు పూర్తి అయ్యేలా చర్యలు తీసుకుంటామని కాంట్రాక్టరు కోటయ్య వెల్లడించారు. రెవెన్యూ అధికారుల సారథ్యంలో త్వరలో ఆర్‌యూబీ నిర్మాణ పనులు చేస్తున్న ఏరియాలో కొలతలు తీస్తారన్నారు. డీసీ చైర్మన్ మందలపు వెంకట నారాయణ, రైల్వే అధికారులు పాల్గొన్నారు.

–శావల్యాపురం



కల్వర్టుతో కలవరం

గణపవరం జాతీయ రహదారి నుంచి రెండు పొగాకు కంపెనీల మధ్యలో మువ్వావారి వీధి నుంచి రైస్‌మిల్లు వరకూ సిమెంటు రోడ్డు ఏర్పాటు చేశారు. అయితే జాతీయ రహదారి సర్వీసు రోడ్డు నుంచి ఈ సిమెంటు రోడ్డు ప్రారంభంలో సైడుకాల్వపై కల్వర్టు కుంగింది. మిగిలిన సగం రోడ్డు అడుగు ఎత్తు మేర దెబ్బతినటంతో ఆ రోడ్డు మీదుగా వెళ్లాలంటే వాహనదారులకు చుక్కలు కనపడుతున్నాయి. ఈ మార్గంలో ద్విచక్ర, నాలుగు చక్రాల వాహనాలు పయనించాలంటే పెద్ద సాహసమే చేయాల్సి వస్తోంది. దీనిపై పంచాయతీ కార్యదర్శి మారుతీ బాబును వివరణ కోరగా మరమ్మతులకు అంచనాలు రూపొందించి ఉన్నతాధికారుల అనుమతితో బాగు చేస్తామని తెలిపారు.

–నాదెండ్ల

అన్నదాత సుఖీభవ నమోదులో కొర్రీలు

- మండల పరిధిలో 7949 మంది అర్హత కలిగిన రైతులుగా ప్రకటన
- జాబితా కుదించేందుకే మరోసారి ఈకేవైసీ
- ఆర్‌బీకేల వద్ద రైతుల పడిగాపులు



గణపవరం ఆర్‌బీకే వద్ద ఈకేవైసీ నమోదు చేయించుకునేందుకు వేచి ఉన్న రైతులు

నాదెండ్ల: పదకొండు అంకెలతో కూడిన యూనిక్ ఐడీ నెంబరుతో ఫార్మర్ రిజిస్ట్రేషన్ చేయించుకున్న ప్రతీ రైతుకు కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు అందుతాయని చెప్పి మార్చి నెలలో రైతులతో రైతు భరోసా కేంద్రాల వద్ద ఫార్మర్ రిజిస్ట్రీ చేయించారు. ప్రస్తుతం అన్నదాత సుఖీభవ పథకం వర్తించాలంటే భూమి ఉన్న ప్రతి రైతు ఆధార్ నెంబరుతో కూడిన ఈకేవైసీ తప్పనిసరిగా చేయించుకోవాలని ప్రభుత్వం అధికారులకు సూచించడంతో రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఈ నెల 20తో గడువు ముగుస్తుందని అధికారులు చెబుతుండటంతో భూమి ఉన్న ప్రతి రైతు రైతు భరోసా కేంద్రాల వద్ద క్యూలో పడిగాపులు కాస్తున్నారు. అయితే కొన్ని రైతు భరోసా కేంద్రాల వద్ద సర్వర్లు పని చేయకపోవటంతో రైతులు కార్యాలయాల వద్ద, చెట్ల క్రింద నిరీక్షిస్తున్నారు.

నాదెండ్ల పరిధిలో...

మండల పరిధిలో అన్నదాత సుఖీభవ పథకానికి 7949 మంది రైతుల పేర్లతో కూడిన అర్హుల జాబితా సిద్ధమైంది. అయితే రైతుల సంఖ్యను తగ్గించేందుకు ఈకేవైసీ పేరుతో రైతులను ఇబ్బందులకు గురిచేస్తున్నారంటూ పలువురు రైతులు ఆరోపిస్తున్నారు. ప్రస్తుతం రైతులు రైతు భరోసా కేంద్రాల వద్దకు వెళ్లి ఈకేవైసీ చేయించుకున్న వారికి చుక్కెదురౌతోంది.

కొందరు రైతుల భూములు ఈనాం, చుక్కల భూమి, ప్రభుత్వ భూమిగా ఆన్‌లైన్‌లో చూపిస్తుండటంతో అధికారులు ప్రస్తుతం మీ వద్ద ఉన్న పాసు పుస్తకం జిరాక్సు, 1–బి అడంగలు, ఆధార్ తెమ్మంటూ రైతులకు హుకుం జారీ చేస్తున్నారు. దీంతో రైతులు ఆయా పత్రాలు తీసుకుని రెవెన్యూ అధికారులకు సమర్పిస్తున్నారు. తుది అర్హుల జాబితాలో తమ పేరు ఉంటుందా లేదా అనే ప్రశ్న రైతులను ఆందోళనకు గురిచేస్తోంది.

సరిచేసి ఇవ్వాల్సింది రెవెన్యూనే!

నాదెండ్ల మండల పరిధిలో 7949 మంది రైతులు అన్నదాత సుఖీభవ పథకానికి అర్హులైయున్నారు. ఈ నెల 20వ తేదీ వరకూ రైతు భరోసా కేంద్రాల వద్ద భూమి ఉన్న ప్రతి రైతు ఈకేవైసీ చేయించుకోవాలని ఆదేశాలిచ్చింది. కొందరు రైతుల భూముల వివరాలు ఆన్‌లైన్‌లో చూపకపోవటంతో రెవెన్యూ అధికారులు సరిచేయాల్సి ఉంది.

–ఎ హరిప్రసాద్, ఏవో, నాదెండ్ల

పచ్చిరొట్ట విత్తనాలు రైతులు సద్వినియోగం చేసుకోండి

ఏవో ఆంజనేయ నాయక్



రైతులకు విత్తనాల సంచులను అందజేస్తున్న ఏవో ఆంజనేయనాయక్

నూజెండ్ల: పచ్చిరొట్ట పైర్ల సాగుతో భూమి సారవంతమవుతుందని మండల వ్యవసాయ అధికారి ఎ.ఆంజనేయ నాయక్ అన్నారు. సోమవారం మండల కేంద్రమైన నూజెండ్ల రైతుసేవా కేంద్రంలో రైతులకు 50 శాతం రాయితీపై పచ్చిరొట్ట విత్తనాలను జనుము, జీలుగా, పిల్లిపెసర విత్తనాలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఏవో ఆంజనేయ నాయక్ మాట్లాడుతూ వ్యవసాయ సీజను ప్రారంభానికి నెల రోజుల ముందుస్తుగా రైతులు తమ పొలాల్లో పచ్చిరొట్ట విత్తనాలను సాగు చేసి అనంతరం సేంద్రియ ఎరువుగా మారుతుందని తద్వారా అన్ని రకాల పోషకాలు సమృద్ధిగా ఉంటాయన్నారు. పెట్టుబడులు తగ్గటంతో పాటు ఆశించిన స్థాయిలో దిగుబడులు వస్తాయన్నారు. రైతులందరూ సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఇందుకు గాను ప్రతి రైతు ఆధార్, పొలం పట్టాదారు పాసు పుస్తకం జిరాక్స్ కాపీలను అందజేసి రాయితీ నగదు చెల్లించి విత్తనాలను తీసుకోవాలన్నారు. రాయితీ మినహాయించి జీలుగా కేజీ రూ.60.50 పైసలు, జనుము కేజీ రూ.54.50, పిల్లిపెసర కేజీ రూ.90.00 రూపాయలకు ఇస్తున్నట్లు ఏవో తెలిపారు. ఈ కార్యక్రమంలో ఏఈవో ఏలీషా, వీపీఏ అశోక్ రైతులు పాల్గొన్నారు.

పాతూరు నివాసంలో చోరీ



నరసరావుపేటటౌన్: దైవ దర్శనానికి వెళ్లి వచ్చే లోపు దొంగలు ఇల్లు లూటీ చేసిన సంఘటన సోమవారం పట్టణంలో వెలుగు చూసింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. పాతూరు శివాలయం సమీపంలో నివాసం ఉంటున్న తడికమళ్ల పెద్ద హనుమంత రావు కుటుంబంతో కలిసి శనివారం దైవదర్శనం కోసం శ్రీశైలం వెళ్లాడు. ఆదివారం రాత్రి తిరిగి వచ్చే సరికి వేసిన ఇంటి తాళాలు పగులగొట్టి ఉన్నాయి. గృహంలోకి వెళ్లి పరిశీలించగా బీరువాలో ఉండవలసిన రెండు బంగారు గాజులు, చైన్, లాకెట్, చెవి దిద్దులతో పాటు ల్యాప్ ట్యాప్, రూ.10 వేల నగదు కనిపించ లేదు. సమాచారం అందుకున్న టూటౌన్ సీఐ ఎం. హైమారావు సిబ్బందితో సోమవారం సంఘటనా స్థలానికి చేరుకున్నారు. చోరీ జరిగిన తీరును బాధితులను అడిగి తెలుసుకున్నారు. క్లూస్‌టీం గృహాన్ని పరిశీలించి ప్రాథమిక ఆధారాలను సేకరించారు. ఈ మేరకు బాధితుడిచ్చిన ఫిర్యాదుతో కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు.

పలు గ్రామాల్లో 'పొలం పిలుస్తోంది' కార్యక్రమం

వినుకొండ: వినుకొండ రూరల్ మండలం గోకనకొండ, నాగులవరం గ్రామాల్లో పొలం పిలుస్తుంది కార్యక్రమం సోమవారం నిర్వహించారు. వినుకొండ వ్యవసాయ శాఖ అధికారితో పాటు, పశుసంవర్ధక, ఉద్యానవన శాఖ అధికారులు పాల్గొన్నారు. రైతులకు ప్రభుత్వం అందిస్తున్న పథకాలు, నూతనంగా సాగు చేయాల్సిన పంటలపై అధికారులు అవగాహన కల్పించారు. పంట సాగులో తీసుకోవాల్సిన జాగ్రత్తలు వివరించారు. కార్యక్రమంలో ఏఓ వరలక్ష్మి, అధికారులు, స్థానిక రైతులు పాల్గొన్నారు.

కుమారుడి మృతిపై మాతృమూర్తి ఆందోళన

- న్యాయం చేయాలంటూ డిమాండ్
- కులసంఘ నాయకులతో కలిసి కలెక్టరేట్‌లోకి వెళ్లేందుకు ప్రయత్నం
- అడ్డుకున్న పోలీసు అధికారులు
- కలెక్టర్ సూచనపై ఎస్పీని కలిసిన బాధితులు, నాయకులు



కలెక్టర్ కార్యాలయం ముందు ఆందోళన చేస్తున్న బాధితులు, కులసంఘ నాయకులు

నరసరావుపేట: తన కుమారుడిని చంపి బావిలో పడేశారని, దీనిపై సమగ్ర విచారణ జరిపించి దోషులపై హత్యకేసు నమోదు చేయాలని కోరుతూ రొంపిచర్ల మండలం అలవాల గ్రామానికి చెందిన మృతుని తల్లి దాసరి నాగమ్మ, కుల సంఘాల నాయకులు కోరారు. ఈ మేరకు వారు సోమవారం కలెక్టర్ కార్యాలయం ఎదుట పెద్దపెట్టున నినాదాలు చేస్తూ కార్యాలయంలోకి దూసుకెళ్లేందుకు చేసిన ప్రయత్నాలను పోలీసు అధికారులు అడ్డుకున్నారు. రొంపిచర్ల పోలీసులపై చర్యలు తీసుకోవాలని, కలెక్టర్ స్వయంగా తమ వద్దకు వచ్చి హామీ ఇచ్చేంతవరకు విశ్రమించేది లేదని భీష్మించుకున్నారు. ఈ సందర్భంగా నాగమ్మ మాట్లాడుతూ ఈనెల 12న గ్రామంలో నేలబావిలో తన కుమారుడు చనిపోయాడని, వెలికితీసి చూడగా తలమీద రక్తగాయం, ముక్కులో నుంచి రక్తం, నోటిలో నుంచి రక్తం కారటం గమనించామన్నారు. గ్రామంలోని అగ్రకులానికి చెందిన కొందరు పెద్దలు కేసువద్దు, పోస్టుమార్టం వద్దంటూ తనచేత బలవంతంగా మృతదేహాన్ని పూడ్చించారన్నారు. మండల పోలీసు అధికారులకు తన కుమారుడి ఉదంతం తెలియచేసినా వారెటువంటి చర్యలు తీసుకోలేదని పేర్కొన్నారు. డీఆర్ఓ ఏకా మురళి వారి వద్దకు వచ్చి కలెక్టర్ ఐదు నిమిషాలలో కలుస్తారని హామీ ఇచ్చారనీ, అనంతరం పీజీఆర్ఎస్‌లో ఉన్న కలెక్టర్ పి.అరుణ్‌బాబు పిలుపు మేరకు తల్లి నాగమ్మ, కులసంఘాల నాయకులు కలెక్టర్‌ను కలిసి తమ డిమాండ్‌ను తెలియచేస్తూ వినతిపత్రం అందజేశారు. జిల్లా ఎస్పీని కలిసి అందజేయాలని కలెక్టర్ ఆ పత్రంపై రాసి సూచించారు. దీంతో వారందరూ జిల్లా పోలీసు కార్యాలయంలో జరుగుతున్న పీజీఆర్ఎస్‌కు వెళ్లి విన్నవించారు. ఎంఆర్‌పీఎస్ఎస్ నాయకుడు మీరయ్య మాదిగ, పలువురు కులసంఘ నాయకులు పాల్గొన్నారు.

గణపవరం సచివాలయంలో అక్షరాభ్యాసం



గణపవరం 1వ సచివాలయంలో చిన్నారులకు అక్షరాభ్యాసం

నాదెండ్ల: మూడేళ్లు దాటిన చిన్నారులను తల్లిదండ్రులు సమీపంలోని అంగన్‌వాడీ కేంద్రాల్లో చేర్పాలని సూపర్‌వైజర్ శివపార్వతి చెప్పారు. గణపవరం 1వ సచివాలయం వద్ద సోమవారం ఐసీడీఎస్ ఆధ్వర్యంలో ప్రీస్కూల్ చిన్నారులకు అక్షరాభ్యాసం నిర్వహించారు. 72 మంది చిన్నారులకు పీపీ1, పీపీ2 పుస్తకాలను పంపిణీ చేసి ఆశీర్వదించారు. చిన్నారులకు పలకలు, బలపాలు అందించి అక్షరాభ్యాసం చేయించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ గ్రామ పరిధిలో 18 అంగన్‌వాడీ కేంద్రాలున్నాయని, వీటి పరిధిలో మొదటి విడతగా 72 మంది చిన్నాలను సమీపంలోని అంగన్‌వాడీ కేంద్రాల్లో చేర్పి అడ్మిషన్లు అందించినట్లు తెలిపారు. అంగన్‌వాడీల ప్రాముఖ్యత, గర్భిణులు, బాలింతలు, చిన్నారులు, కిశోర బాలికలకు అందిస్తున్న పోషకాహారం, పథకాల గురించి వివరించారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శులు మారుతి బాబు, కె.కవిత, మహిళా పోలీసు కోమలి, అంగన్‌వాడీ కార్యకర్తలు, ఆయాలు పాల్గొన్నారు.

గ్రామ సహాయకుల సమస్యలు పరిష్కరించాలి



యడ్లపాడు: గ్రామ రెవెన్యూ సహాయకులు (వీఆర్‌ఏలు) తమ సమస్యలను పరిష్కరించాలని కోరుతూ సోమవారం రెవెన్యూ కార్యాలయంలో తహసీల్దార్ జెట్టి విజయశ్రీకి వినతి పత్రం సమర్పించారు. వీఆర్‌ఏలు ఎదుర్కొంటున్న ప్రధాన సమస్యలను ఈ వినతిపత్రంలో స్పష్టంగా వివరించారు. ముఖ్యంగా, వీఆర్‌ఏలకు తక్షణమే పేస్కేల్ అమలు చేయాలని వారు డిమాండ్ చేశారు. అర్హులైన వీఆర్‌ఏలను గ్రామరెవెన్యూ అధికారులు (వీఆర్వోలు)గా పదోన్నతి కల్పించాలని, అలాగే ఏళ్లుగా నామినీలుగా పనిచేస్తున్న వారిని వీఆర్‌ఏలుగా నియమించాలని కోరారు. అదనంగా, అటెండర్, నైట్ వాచ్‌మెన్ ప్రమోషన్ కోటాను 20 శాతం నుండి 70శాతానికి పెంచాలని విజ్ఞప్తి చేశారు. తమపై అనధికారికంగా మోపుతున్న అదనపు విధుల భారాన్ని తగ్గించాలని, అనధికార విధులను రద్దు చేయాలని కూడా వినతిపత్రంలో పేర్కొన్నారు. మండల వీఆర్‌ఏలసంఘం అధ్యక్షుడు జయప్రసాద్, వీఆర్‌ఏలు నరసింహారావు, డి.రాజేష్ ఆనంద్ తదితరులు పాల్గొన్నారు.

వెన్నుపోటుకు బ్రాండ్ అంబాసిడర్ సీఎం చంద్రబాబు



ఏడాది వెన్నుపోటు ప్రభుత్వంపై పుస్తకం, పోస్టర్లను ఆవిష్కరించిన మాజీమంత్రి విడదల రజిని

- మాజీమంత్రి విడదల రజిని
- వెన్నుపోటు ప్రభుత్వంపై పుస్తకావిష్కరణ
- ప్రజాక్షేత్రంలోకి ప్రభుత్వ వైఫల్యాలు తీసుకెళ్తామంటూ పిలుపు

చిలకలూరిపేట (యడ్లపాడు): వెన్నుపోటుకు బ్రాండ్ అంబాసిడర్ సీఎం చంద్రబాబు నాయుడు అని మాజీ మంత్రి విడదల రజిని విమర్శించారు. చిలకలూరిపేట పట్టణంలోని ఆమె నివాసంలో పార్టీ శ్రేణులతో పుస్తక ఆవిష్కరణ చేశారు. కూటమి సర్కార్ ఏడాది పాలనలో ఎలాంటి హామీలు అమలు చేయకుండా రాష్ట్ర ప్రజలకు వెన్నుపోటు పొడిచిన సంగతులపై రూపొందించిన జగన్ అంటే నమ్మకం, చంద్రబాబు అంటే మోసం అనే వెన్నుపోటు పుస్తకం, పోస్టర్లను పార్టీ శ్రేణులతో కలిసి రజిని ఆవిష్కరించారు. ప్రభుత్వం ఎన్నికల ముందు, అధికారంలోకి వచ్చిన తర్వాత చేసిన మోసాలను క్షేత్రస్థాయిలో ప్రజల్లోకి తీసుకెళ్లేందుకు ఈ పుస్తకం వారధి కానుందన్నారు. కూటమి ప్రభుత్వం అధికారం చేపట్టి ఏడాది కాలంలో ఐదు కోట్ల ఏపీ రాష్ట్ర ప్రజలకు ఇచ్చిన హామీల్లో ఏ ఒక్కటి నెరవేర్చక పోవడం పాలనా పరమైన వైఫల్యమన్నారు. చెప్పిన మాటకు కట్టుబడి పారదర్శక పాలనకు కేరాఫ్ అడ్రస్ వైఎస్సార్ సీపీ ప్రభుత్వం అన్నారు. మాజీ సీఎం జగన్‌మోహన్‌రెడ్డి అమ్మఒడి పథకం కింద రూ.15 వేలు విడుదల చేసి, అందులో రూ.వెయ్యి పాఠశాల నిర్వహణకు ఉపయోగించుకోవాలని చెప్పినపుడు, రాద్ధాంతం చేసిన ప్రస్తుత మంత్రి నారా లోకేష్ ఇప్పుడు తల్లికి వందనం పథకం డబ్బుల్లో రూ.2 వేలు తగ్గించి ఇవ్వడం, వాటిని పాఠశాలలకు కాకుండా ఎక్కడికి మళ్లిస్తున్నారో చెప్పాలన్నారు.

మర్యాద పూర్వకంగా కలిసిన పార్టీ అధ్యక్షులు

వైఎస్సార్‌సీపీ అసెంబ్లీ నియోజకవర్గ పట్టణ, మండల అధ్యక్షులుగా నూతనంగా నియామకమైన పట్టణ అధ్యక్షులు షేక్ దరియావలి, చిలకలూరిపేట మండలం దేవినేని శంకరరావు, నాదెండ్ల మండలం మంగు ఏడుకొండలు, యడ్లపాడు మండలం వడ్డేపల్లి నరసింహారావు(రాజు)లు మాజీమంత్రి విడదల రజినిని మర్యాద పూర్వకంగా కలిశారు. పల్నాడు జిల్లా యూత్ అధ్యక్షులు కందుల శ్రీకాంత్, జిల్లా ఉపాధ్యక్షుడు మద్దూరి కోటిరెడ్డి, జిల్లా అధికార ప్రతినిధి ఉడతా వెంకటేశ్వరరావు, జిల్లా కార్యదర్శి మున్సిపల్ వైఎస్ చైర్మన్ వలేటి వెంకటేశ్వరరావు, నాయకులు గోపతోటి జాన్, మైలా రాజేష్, ప్రభుదాసు నాయుడు, కల్లి వెంకటరెడ్డి, గుత్తా వేమలయ్య, సాపా సైదావలి, ఊసా రమేష్, మోషే, రంజిత్, రామిశెట్టి శివ, బందారు జయ, వీరయ్య, గుంజి శ్రీనుపాల్గొన్నారు.

అథ్లెటిక్స్‌లో ఎస్ఎస్ అండ్ ఎన్ విద్యార్థులకు పతకాలు



విద్యార్థులను అభినందిస్తున్న పాలకవర్గ ప్రతినిధులు

నరసరావుపేట ఈస్ట్: ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర సీనియర్స్ అంతర్ జిల్లాల అథ్‌లెటిక్స్– 2025 చాంపియన్‌షిప్ పోటీలలో శ్రీసుబ్బరాయ అండ్ నారాయణ కళాశాల విద్యార్థులు పతకాలు సాధించినట్టు కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ ఎం.ఎస్.సుధీర్, వ్యాయామ అధ్యాపకుడు డాక్టర్ యక్కల మధుసూదన రావు సోమవారం తెలిపారు. ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయం అథ్‌లెటిక్స్ ట్రాక్‌పై శనివారం నిర్వహించిన రాష్ట్రస్థాయి పోటీలో తమ విద్యార్థులు కె.ప్రసన్నకుమార్ 100 మీటర్ల పరుగులో రజితం, సి.హెచ్.వి.మారుతి గురుశంకర్ 110 మీటర్ల పరుగులో కాంస్య పతకం సాధించినట్టు వివరించారు. విద్యార్థులను కళాశాల పాలకవర్గ అధ్యక్ష కార్యదర్శులు కపలవాయి విజయ కుమార్, నాగసరపు సుబ్బరాయ గుప్త, జాయింట్ సెక్రటరీ ఊటుకూరి వెంకట అప్పారావు, వైస్ ప్రిన్సిపల్ డాక్టర్ పి.శ్రీనివాస సాయి, కమిటీ సభ్యులు, అధ్యాపకులు అభినందించారు.

రైతులందరికీ ఈకేవైసీ అవసరం లేదు

అవసరమైన రైతులకు సమాచారం ఇస్తాం

రొంపిచర్ల: ప్రభుత్వం త్వరలో అమలు చేయనున్న అన్నదాత సుఖీభవ పథకం లబ్ధిదారులైన భూ యజమానులందరూ విధిగా రైతు భరోసా కేంద్రాలకు వెళ్లి ఈకేవైసీ చేయించుకోవాల్సిన అవసరం లేదని మండల వ్యవసాయ అధికారి శివలలిత సోమవారం తెలిపారు. ఆధార్ ఆధారంగా ఇప్పటి వరకు వివిధ పథకాలకు సంబంధించి పూర్తి అయిన ఈకేవైసీల ఆధారంగా 97 శాతం మేర ఈకేవైసీ కార్యక్రమాన్ని పూర్తి చేశామన్నారు. అయితే మిగిలి ఉన్న రైతులకు ఆయా గ్రామాల విలేజ్ అగ్రికల్చర్ అసిస్టెంట్‌లే స్వయంగా రైతులను కలిసి ఈకేవైసీ సేకరించనున్నట్లు ఏవో తెలిపారు. ఇప్పటి వరకు మండలంలోని 13 రెవెన్యూ గ్రామాల్లో అన్నదాత సుఖీభవ పథకానికి అర్హులైన లబ్ధిదారులు 9,482 మంది ఉండగా, ఆధార్ లభ్యత ఆధారంగా వీఏఏల ఈకేవైసీ సేకరణ ద్వారా 9,230 మంది ఈకేవైసీ కార్యక్రమం పూర్తి చేశామన్నారు. మండలం మొత్తం మీద మరో 252 మందికే ఈకేవైసీ చేయాల్సి ఉంది. మండలంలోని 13 రెవెన్యూ గ్రామాల్లో లబ్ధిదారుల ఈకేవైసీ వివరాలు ఇలా ఉన్నాయి. నల్లగార్లపాడు గ్రామంలో 197 మంది అన్నదాత సుఖీభవ పథకానికి అర్హులైన లబ్ధిదారులు ఉండగా అందరి రైతులకు ఈకేవైసీ పూర్తి అయ్యింది. అన్నవరప్పాడులో 185 మంది ఉండగా, ఈకేవైసీ పూర్తిగాని లబ్ధిదారులు ఐదుగురు. విప్పర్లలో గ్రామ రెవెన్యూ పరిధిలో 1981 మంది ఉండగా 45 మంది లబ్ధిదారులకు ఈకేవైసీ చేయాల్సి ఉంది. దాసరిపాలెం పరిధిలో 639 మందికి గాను 15 మంది, సంతగుడిపాడు పరిధిలో 694 గాను 25 మంది, అన్నవరంలో 1075 గాను 25 మంది, అలవాల 553 గాను 14 మంది, ఆరేపల్లి అగ్రహారం 283 గాను 10 మంది, మాచవరం 741 గాను 15 మంది, తురిమెళ్లలో 880 గాను 14 మంది, రొంపిచర్లలో 1066 గాను 39 మంది, గోగులపాడులో 786 గాను 31 మంది, ముత్తనపల్లిలో 402 లబ్ధిదారులకు గాను 14 మంది లబ్ధిదారులకే ఈకేవైసీ పూర్తి చేయాల్సి ఉందని మండల వ్యవసాయ అధికారి తెలిపారు.

హత్య కేసులో నిందితుడు అరెస్టు

- చాకచక్యంగా ఛేధించిన కేసు
- రూరల్ సీఐ, యడ్లపాడు ఎస్ఐలను ప్రశంసించిన జిల్లా ఎస్పీ



నిందితుడితో సీఐ బి సుబ్బానాయుడు, యడ్లపాడు ఎస్ఐ టి శివరామకృష్ణ సిబ్బంది

యడ్లపాడు: హత్య కేసులో నిందితుడిని సోమవారం పోలీసులు అరెస్టు చేశారు. ఈ సందర్భంగా రూరల్ పోలీస్‌స్టేషన్‌లో పోలీసులు మీడియా సమావేశం నిర్వహించారు. చిలకలూరిపేట రూరల్ సీఐ బి.సుబ్బానాయుడు కేసు సంబంధించిన వివరాలను వెల్లడించారు. యడ్లపాడు మండలం తిమ్మాపురం గ్రామం పరిధిలోని శ్రీ మంజునాథ స్పిన్నింగ్ మిల్లునందు పనిచేస్తున్న ఒడిశాకు చెందిన జగన్నాథ్ కులదీప్ (35)ను జూన్ 10న రాత్రి సుమారు 11 గంటల సమయంలో నిందితుడు మరోకార్మికుడు మంగులు లంకా కత్తితో పొడిచాడు. దీంతో తీవ్రగాయాలైన కులదీప్ ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మూడు రోజులు తర్వాత మృతి చెందిన విషయం విదితమే. నరసరావుపేట డీఎస్పీ కె. నాగేశ్వరరావు పర్యవేక్షణలో చేపట్టిన ఈ కేసు చాకచక్యంగా ఛేదించినట్లు పేర్కొన్నారు. కులదీప్ భార్య స్వగ్రామానికి వెళ్లిన సందర్భంలో సహ కార్మికుడు మంగులు లంకా, జగన్నాథ్ కులదీప్ భార్య ఎప్పుడొస్తుందని ప్రశ్నించడంతో కులదీప్ అసభ్యకరంగా దూషించాడు. దీంతో ఆగ్రహించిన మంగులు తన గదికి వెళ్లి కూరగాయలు కోసే కత్తితో తిరిగి వచ్చి, జగన్నాథ్ కులదీప్‌పై దాడి చేశాడు. కత్తి పోట్లలో దిగడంతో తీవ్ర గాయాలపాలైన జగన్నాథ్ కులదీప్ (35) ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మరణించాడు. మృతుని భార్య రుని కులదీప్ ఫిర్యాదుతో యడ్లపాడు పోలీస్ స్టేషన్లో కేసు నమోదైంది. జూన్ 16న ఉదయం 11 గంటలకు తిమ్మాపురం ఎస్‌కే జేబీకాటన్ జిన్నింగ్ మిల్ వద్ద నిందితుడు మంగులు లంకాను పోలీసులు అరెస్టు చేసి కోర్టుకు హాజరుపరిచారు. కేసును చాకచక్యంగా, వేగంగా ఛేదించిన సీఐ సుబ్బానాయుడు, యడ్లపాడు ఎస్ఐ టి.శివరామకృష్ణ, సిబ్బందిని జిల్లా ఎస్పీ అభినందించారు.